

# నవభూమి

## జిల్లా అనుబంధం

08 ఫిబ్రవరి,2025 శనివారం పేజీలు:7

www.epaper.navabhoomi.in


# విద్యార్థుల అభ్యాసన స్థాయిలో నాణ్యత పరమైన పురోగతి సాధించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- బోధన నాణ్యతపై హెడ్ మాస్టర్ లు దృష్టి సారించాలి
- 10వ తరగతి ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి
- విద్యలో మనం సాధిస్తున్న విజయాలపై విస్తృత ప్రచారం కల్పించాలి
- మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో పదవ తరగతి పరీక్షల సన్నద్ధత
- విద్యా శాఖ కార్యక్రమాలపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్







**ఖమ్మం నవభూమి బ్యూరో, ఫిబ్రవరి 07:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల అభ్యాసన స్థాయిలలో నాణ్యత పరమైన పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, విద్యా శాఖ కార్యక్రమాలపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు విద్య అందుతుందన్న నమ్మకం తల్లిదండ్రులకు కల్పించాల్సిన బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయులపై ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధన పద్ధతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పిల్లలకు పాఠ్యాంశం సులభంగా అర్థమయ్యేలా బోధన జరగాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పిల్లలకు ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారు, సబ్జెక్టు బోధించే అంశంలో ఉపాధ్యాయుల దగ్గర ఏవైనా లోపాలు ఉన్నాయా గమనించి అవసరమైన సలహాలను టీచర్లకు హెడ్ మాస్టర్ లు సూచించాలన్నారు. మార్కులపై మాత్రమే కాకుండా పిల్లలకు ఎంత వరకు అర్థం అవుతుంది, చివరి బెంచ్ విద్యార్థికి కూడా సబ్జెక్టుపై ఆసక్తి కల్గించేలా చేయాలని, టీచర్లకు అవసరమైన గైడెన్స్, శిక్షణ అందించాలని అన్నారు. పాఠశాల తరగతి గదిలో పిల్లలతో ఇంటరాక్షన్ ఎక్కువ జరగాలని, పిల్లల ఏకాగ్రత పెంచేలా బోధన చేయాలని అన్నారు. కొంత వెనుకబడిన విద్యార్థులతో ప్రత్యేకంగా కూర్చుని మాట్లాడాలని అన్నారు. రాబోయే 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పిల్లలు చదువుపై శ్రద్ధ పెట్టేలా తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు పౌష్టికాహారం మాత్రమే తీసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి అర్హతకు 10వ తరగతి మార్కులే ప్రధానమని, ఉద్యోగ ఇంటర్వ్యూకు వెళ్ళినప్పుడు 10వ తరగతి మార్కులను చూస్తారే గాని ధనిక, పేద వర్గాలని చూడరని అన్నారు. మనమంతా ధృడ సంకల్పంతో, పట్టుదలతో పనిచేస్తే మన పాఠశాల స్థాయి మరింత ఉన్నతంగా మారుతుందని, తద్వారా రాబోయే తరం నాణ్యమైన సమాజాన్ని నిర్మిస్తుందని అన్నారు. ప్రభుత్వ విద్యారంగం వైభవానికి మనమంతా కలిసి పని చేయాలని, ఒకే రోజు అద్భుతమైన మార్పు సాధ్యం కాకపోయినా పాజిటివ్ డైరెక్షన్ వైపు మనం పని చేయడం ప్రారంభిస్తే కొన్ని సంవత్సరాల తర్వాత ప్రభుత్వ విద్యలో అద్భుతమైన మార్పులు వస్తాయని, విద్యతో పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు మంచి పునాది వేయాలని కలెక్టర్ తెలిపారు. అమ్మా, నాన్నలతో పాటు పిల్లల భవిష్యత్తును మంచి మార్గంలో నడిపించే అవకాశం గురువుకి దొరుకుతుందని, విద్యార్థులు మంచి విద్యను అందించి వారి జీవితాల్లో మార్పు తీసుకొని వచ్చేలా పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయులు పిల్లల కోసం పని చేస్తున్నా మన్న బాధ్యతను దృష్టిలో ఉంచుకోవాలని, ఉపాధ్యాయుడిగా ఎంత మందిని పిల్లలను ప్రయోజకులుగా చేశామనేది ముఖ్యమని, మన వల్ల ఇంత మంది పిల్లలు ప్రయోజకులు అయ్యారంటే మనకు గర్వంగా ఉంటుందని అన్నారు. విద్యార్థులకు ఉన్న ఆసక్తులను గమనించి వారిని ఆ రంగాలలో ప్రోత్సహించాలని, పరీక్షలపై విద్యార్థులకు ఉన్న భయాన్ని తొలగించి, నమ్మకంతో సునాయసంగా పరిక్షలు రాసేందుకు కృషి చేయాలని, విద్యార్థుల విద్యా స్థితి గతులను పరీక్షిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు మనవంతు సహాకారం అందించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయులు పంచసూత్రాలైన ఐదు అంశాలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల, పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి పెట్టి తల్లిదండ్రులను సంప్రదించాలని, సరైన కారణాలు తెలుసుకొని విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చే విధంగా చూడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల కొంతమంది ప్రజలకు ఉన్న అపోహలు తొలగించే దిశగా, విద్యా వ్యవస్థలో ప్రభుత్వం నూతనంగా కల్పిస్తున్న వసతులు, పాఠశాలలో మారుతున్న బోధన పద్ధతులు, వస్తున్న ఫలితాలపై ప్రచారం కల్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం పెంచాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న స్థితిగతులు, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి, కల్పించబడ్డ వసతులు, అలాగే మన విద్యార్థులు సాధించిన ఫలితాలు అందరికి, ముఖ్యంగా తల్లిదండ్రులకు తెలిసే లాగా చేయాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెరిగే విధంగా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు

# ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ భద్రాచలం ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ





**భద్రాచలం జనవరి 7 నవభూమి ప్రతినిధి:** మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాల నుండి ఏరియా ఆసుపత్రిలో ఎక్కువ శాతం నిరుపేదలైన ప్రజలు వైద్యం కోసం వస్తుంటారని, అందులో ముఖ్యంగా అమాయకులైన ఆదివాసి గిరిజన మహిళలకు సిజేరియన్ ఆపరేషన్ లతో డెలివరీ కాకుండా నార్మల్ డెలివరీ అయ్యేలా సంబంధిత డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సంబంధిత వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం నాడు భద్రాచలం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్, ఓపి, మెటర్నిటీ వార్డు, ఆరోగ్యశ్రీ వార్డు, వైద్య చికిత్స కోసం వచ్చిన ప్రజలతో అందుచున్న వైద్య సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల టెస్టులు ఉచితంగా చేయాలని, సిబ్బంది రోగుల వద్ద నుండి డబ్బులు ఆశించకూడదని, టెస్టుల కోసం ఎవరిని బయటకు పంపించకూడదని, డాక్టర్లు సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని, గర్భిణీ స్త్రీలు ఏ సమయంలోనైనా కాన్పు కోసం ఆసుపత్రికి వచ్చినప్పుడు తప్పనిసరిగా ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి నార్మల్ డెలివరీ అయ్యేలా చూడాలని, లింగ నిర్ధారణ పరీక్షలు పొరపాటున చేయకూడదని, సిజేరియన్ కాకుండా నార్మల్ డెలివరీలకే ప్రాముఖ్యత ఇచ్చి నార్మల్ డెలివరీల సంఖ్య పెరగాలని, గర్భిణీ స్త్రీల విషయంలో వార్డు సిబ్బంది డాక్టర్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించే వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రతిరోజు ఓపి సంబంధించిన రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని అలాగే ప్రతి స్టిల్ బర్త్ కేసులను రిజిస్టర్ చేయాలని, ప్రతి కాన్పులను ఆన్లైన్ చేయాలని, గర్భిణీ స్త్రీలకు ఏమైనా సమస్య ఉండి అబార్షన్ చేయవలసిన పరిస్థితి వస్తే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో అన్ని జబ్బులకు సంబంధించిన సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని, మందుల కొనుగోలు కొరకు పేషెంట్లను ఎవరిని బయట మెడికల్ షాపులకు పంపకూడదని అన్నారు. వార్డులు మరియు ఆసుపత్రి ఆవరణలో పరిసరాలు శుభ్రంగా ఉండాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమయానుకూలంగా వైద్య పరీక్షలు నిర్వహించి తగినన్ని మందులు ఇవ్వాలని, రోగుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని అన్నారు. భద్రాచలంలో వివిధ టెస్టుల కోసం నిర్వహిస్తున్న ల్యాబ్ లలో ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేయకుండా ఒకే తరహాలో రేట్లు ఉండేలా డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో చైతన్య, ఆస్పత్రి పర్యవేక్షకుడు రామకృష్ణ, ఆర్ ఎం ఓ సంతోష్ కుమార్, ఆయుష్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ ప్రమాద బాధితులకు మంత్రి పొంగులేటి పరామర్శ

**బోనకల్, నవభూమి, ఫిబ్రవరి 7:** ఇటీవల బోనకల్ మండల పరిధిలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన ఓ మహిళ కుటుంబాన్ని, గాయపడిన పలువురు మహిళలను తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా బోనకల్ లోని ఎస్ ఆర్ గార్డెన్స్ లో జరిగిన గూడూరు వెంకటేశ్వరరావు కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు. నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని నూతన వధూవరులను ఆశీర్వదించారు.





# హామీలు అమలు చెయ్యడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం




**గార్ల,నవభూమి, ఫిబ్రవరి 7:** శుష్క వాగ్దానాలు, శూన్య హస్తాలు చూపి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ చెయ్యని పనులను చేసినట్లు ప్రచారం చేస్తుకుంటు ప్రజలను దగా చేస్తుందని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జడ సత్యనారాయణ అన్నారు. నెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గార్ల మండలం ముత్తి తడలో గురువారం రాత్రి ముమ్మరం ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆచరణలో చేసిన వాగ్దానాలను నెరవేర్చలేదని విమర్శించారు. గత ప్రభుత్వం అనేక ఆశలు చూపి ప్రజావ్యతిరేక విధానాలను అనుసరించిందని ఫలితంగా ప్రజలు ఆ ప్రభుత్వాన్ని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు ప్రజాస్వామ్య పాలన తో పాటు 420 వాగ్దానాలు చేశారని ఈ వాగ్దానాల్లో ఒకటి అరదప్ప ఏ వాగ్దానాన్ని అమలు చేయలేదని ప్రజల్లో జెట్ స్పీడ్ తో వ్యతిరేకత ఉందని చెప్పారు. 14 నెలలు అయినా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందిందన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమంలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సత్య నారాయణ కోరారు.ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ మండల నాయకులు ఇస్లావత్ రాందాస్, మహిళా సంఘం మండల నాయకురాలు ధనలక్ష్మి, కౌసల్య, బిచ్చ,భాస్కర్, దుర్గేష్, వర్ష, నవత, శ్రావణి, జోత్స్న, గీత,తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మతల్లి గుడి ప్రాంగణంలో శివాలయం

### విగ్రహ ప్రతిష్ట పూజల్లో పాల్గొన్న కొత్వాల

**పాల్వంచ ఫిబ్రవరి 7 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ మండలం పరిధి జగన్నాధపురం లోని శ్రీ కనకదుర్గ దేవాలయం (పెద్దమ్మతల్లి గుడి) ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ఈ నెల 10వ తేదీన విగ్రహ ప్రతిష్టాపన జరుగుతున్న సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రతిష్ఠామూర్తులకు జలాధివాసము కార్యక్రమం చేపట్టిన సందర్భంగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, దారా చిరంజీవి, పులి సత్యనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.





# నిర్ధారణ కాని వైరస్: గుట్టలు గుట్టలుగా మరణిస్తున్న కోళ్లు

- వైరస్ వ్యాధితో నాటు కోళ్లు మృతి
- బాయిలర్ కోళ్ల షెడ్లు ఖాళీ
- రెండు నెలల వరకు చికెన్ తినొద్దంటున్న డాక్టర్లు
- ఒక్కో రైతుకు లక్షల్లో నష్టం
- ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం
- 300 నాటు కోళ్లుమృతి







**సత్తుపల్లి, నవభూమి, ఫిబ్రవరి 7 :** నెల రోజులుగా సత్తుపల్లి నియోజకవర్గంలో బాయిలర్ కోళ్లకు నిర్ధారణ కాని ప్రాణాంతక వైరస్ సో కింది. వైరస్ సోకిన కొద్ది గంటల వ్యవధిలోనే షెడ్ లో ఉన్న వేలాది కోళ్లు మరణిస్తున్నాయి. నలతగా ఉన్నట్లు ఒక కోడిని గుర్తించిన రైతు నివారణ చర్యలకు ఉపక్రమించే మిగతా కోళ్లు కూడా మరణించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జనవరి నెలలోనే గ్రామాల్లో పెంచుకుంటున్న నాటు కోళ్లు కూడా మరణించినట్లు తెలిసింది. పూర్వం లా గ్రామాల్లో నాటు కోళ్లు విరివిగా పెంచేంత కాలు స్థలాలు ఇప్పుడు అందరికీ లేవు. అందువల్ల అక్కడక్కడా పెంచే వారి ఇళ్లలో నాటు కోళ్లు మరణించిన ఈ విషయం వెలుగులోకి రాలేదు. ఇదే సమయంలో నాటి కోడి పుంజులను ఆంధ్ర ప్రాంతాలకు వెళ్లి పందాలు వేస్తూ వస్తున్నారు. అప్పటికే ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణాజిల్లాలో బాయిలర్ కోళ్లు లక్షల సంఖ్యలో మరణిస్తూ వచ్చాయి. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాల నుంచి తెలంగాణకు సరిహద్దుగా ఉన్న ఆంధ్ర జిల్లాలోని ప్రాంతాల నుంచి బాయిలర్ కోళ్లు దిగుమతి అయినట్లు తెలిసింది. వ్యాధి గ్రస్తమైన ఈ కోళ్ల ద్వారా వచ్చిన వైరస్ ఈ ప్రాంతంలోని బాయిలర్ కోళ్లకు సోకినట్లు భావిస్తున్నారు. కోవిడ్ తదనంతర కాలం నుంచి బాయిలర్ కోళ్లు పెంచుకునే రైతులకు ఇటువంటి కష్టం ఇప్పుడే వచ్చింది. ఇప్పుడు కోవిడ్ వైరస్ కు భయపడి ప్రజలు చికెన్ తినకపోవడంతో రైతులు నష్టపోయారు. వైరస్ వల్ల కోళ్లు చనిపోయి రైతులు నష్టపోతున్నారు. రోజు వ్యవధిలోనే షెడ్లకు షెడ్లే ఖాళీ అవుతున్నాయి. వేలాది కోళ్లు మరణిస్తున్నాయి. ఒక్కో షెడ్ 5 వేల నుంచి 40 వేల వరకు కోళ్లను పెంచే సామర్థ్యం ఉంది. కొందరు రైతులు ప్రముఖ హ్యాచరీస్ కంపెనీల తో రైతులు ఒప్పందం చేసుకుంటారు. కోడి పిల్లలతో పాటు వాటిని 40 రోజులు పెంచేందుకు అవసరమైన మేతను ఆ కంపెనీలే సరఫరా చేస్తాయి. రైతులు వాటిని పెంచినందుకు బరువును బట్టి కేజీ కు ఇంత చొప్పున ధర చెల్లిస్తారు. ఎక్కువ మంది రైతులు వారే సొంతంగా పిల్లలను సేకరించుకొని ఫీడింగ్ ఖర్చు భరించి కోళ్లను విక్రయిస్తుంటారు. ఇలా చేస్తున్న రైతుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇటువంటి రైతులే భారీ గా నష్టపోయారు. పశుసంవర్ధక శాఖ అధికారులు మరణించిన కోళ్ల శాంపిలను సేకరించి ల్యాబ్స్ కు పంపించారు. ఇప్పటివరకు కారణాలు వెల్లడి కాలేదు. దీంతో పౌల్ట్రీ పరిశ్రమలు నమ్ముకున్న రైతులు ఆర్థికంగా కుదరయ్యారు. రేజర్లకు చెందిన దేశి రెడ్డి వెంకట్ రెడ్డి అనే రైతు నాటు కోడి జాతి పెట్టలు, పుంజులు పెంచుతున్నాడు. ఇతడు పెంచే నాటుకోడి విలువ ఒక్కొక్కటి ఆరువేలు పైగా ఉంటుంది. పుంజుల్లో ఎక్కువ భాగం పందెం రాయుళ్లు కొంటారు. సందర్భాన్ని బట్టి కోడిపుంజు వయసును బట్టి రూ.30 వేల వరకు ధర పలుకుతుంది. శుక్రవారం ఒక్కరోజే ఇతని షెడ్ లో ఉన్న 300 నాటు కోడి పెట్టలు, పుంజులు మరణించాయి. సుమారు నష్టం రూ.10 లక్షల వరకు ఉంటుందంటున్నారు. అరుదైన వైరస్ వచ్చి పుంజులు, పెట్టలు మృతి చెందాయి. స్థానిక పశు వైద్యులకు చూపించగా వారికి కూడా కోళ్ల మృతి వెనక రహస్యం తెలుసుకోలేకపోయారు. అనుమానం వచ్చి దేశి రెడ్డి వెంకటరెడ్డి కోడిపుంజును, కోడిపెట్టను కోసి అన్ని భాగాలను పరిశీలనగా చూడగా గుండె ఒకటే పాడైపోయిందని మిగతా అన్ని బాగానే ఉన్నాయి. గుండె భాగం నజ్జునజ్జుగా అయినట్లు తెలుసుకొని ఆ భాగాలను ఖమ్మం వైద్యులకు పంపి వ్యాధి నిర్ధారణ కోసం ప్రయత్నిస్తున్నారు. కోళ్లు భారీ సంఖ్యలో మరణిస్తుండటంతో ప్రముఖ హ్యాచరీస్ కంపెనీలు భారీగా నష్టపోయాయి. విషయాన్ని బయటకు పక్కనేయకుండా వైరస్ ఉన్న కోళ్లను విక్రయిస్తున్నారు. వీటిని గమనించిన వైద్యులు కనీసం రెండు నెలల వరకు చికెన్ తినకుండా ఉండటమే మంచిదని సలహా ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారీగా నష్టపోయిన రైతులను గుర్తించి వారికి నష్టపరిహారం చెల్లించకపోతే ఆత్మహత్యల శరణ్యం అని పలు రైతులు అంటున్నారు.

# స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సన్మానం

- గౌరవ డాక్టరేట్ పురస్కారం పొందిన మీకోసం మేమున్నాం టీం సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్

**చర్ల ఫిబ్రవరి 7 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో గౌరవ డాక్టరేట్ పురస్కారం పొందిన మీకోసం మేమున్నాం టీం సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ కు చర్ల పౌర సన్మాన కమిటీ వారిచే ఘన సత్కారం జరిగింది. ఈ కార్యక్రమానికి చర్ల స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ సభ్యులను ఆహ్వానించగా హాజరైన క్లబ్ ఉపాధ్యక్షులకి మదిలో కలిగిన స్పందనతో క్లబ్ సభ్యులు కలిసి శుక్రవారం మీకోసం మేమున్నాం టీం సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ కి స్వీట్లు ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ చర్ల మండలంలో అనేక సమస్యలతో ఉన్న ప్రజలు ఉన్నారని వారి సేవచే భాగ్యం ఆయనకు దక్కినందు జీవితం దన్యమైందని, ఇకా చాలా కార్యక్రమాలు చేస్తామని, చేసే కార్యక్రమాలకు మీడియా మిత్రు సహకరించడం వల్లే ప్రజల్లో ఆదరణ తగు సహాయ సకరాలు కమిటీకి అందుతున్నాయని, స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ సభ్యులు స్పందించండం ఆనందంగా ఉందని అన్నారు. మీకోసం మేమున్నాం టీం సంస్థ చేసే కార్యక్రమాలకు స్పందించిన స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ మీకోసం



మేమున్నాం టీం సంస్థ చేసే కార్యక్రమాల్లో మునుముందు సహాయసహకారు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సామల ప్రవీణ్ (చార్మినార్ న్యూస్), ఉపాధ్యక్షులు తోటపలి రామణ( మీ వార్త న్యూస్), సభ్యులు ఎమ్ శ్రీను (ఎఎస్ఎన్ 24 న్యూస్), ఎస్ టి కుమార్ (తెలంగాణ వార్త న్యూస్)లు పాల్గొన్నారు.

# హెూలీ వుడ్‌ను జయప్రదం చేయండి

## ఆరోరా విద్యాసంస్థల చైర్మన్ హరిబాబు




**పాల్వంచ ఫిబ్రవరి 7 నవభూమి ప్రతినిధి:** వచ్చే నెల 14న జరిగే హెూలీ వుడ్ ను జయప్రదం చేయాలని అరోరా విద్యా సంస్థల చైర్మన్ తాళ్లూరి హరిబాబు అన్నారు. శుక్రవారం పట్టణం లోని అరోరా కళాశాలలో మరి కొంతమందితో కలిసి సంబంధిత వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలు మత సామరాస్యానికి ప్రతీకగా నిలుస్తాయని, అందులో హెూలికి ఒక ప్రత్యేకత వుందని అన్నారు. కుల, మతాలకు అతీతంగా చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ సంతోషంగా పండుగ జరుపుకుంటారన్నారు. పాశ్చాత్య సంస్కృతిలో పండగల విలువలను తెలియజేసే ఉదేశ్యంతో మెట్రో నగరాలకే పరిమితమైన హెూలీ వుడ్ సెలబ్రేషన్స్ ను కొత్తగూడెం పట్టణంలో మొట్ట మొదటి సారి ఏర్పాటు చేసిన ఏమ్.కె.ఏ సోషల్ మీడియా ప్రమోటర్ గణేష్ ను అభినందించారు. హెూలీ వుడ్ కార్యక్రమానికి మావంతు గా పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది యెర్రా కామేష్, గోగిళ్ళ గణేష్, బన్ను, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు దుస్తుల పంపిణీ






**చర్ల ఫిబ్రవరి 7 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని పూజారి గూడెం, లెనిన్ కాలనీ, సింగాసముద్రం గ్రామాల్లోని జి.యస్.యస్ డే కేర్ సెంటర్లోని 130 మంది నిరు పేద విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ నీలి ప్రకాష్, చర్ల ఎస్ ఐ కేశవ్, లు పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు కొత్త బట్టలు పంపిణీ చేయడం చాలా సంతోషకరమని ఇటువంటి సహాయాన్ని అందిస్తున్నటువంటి సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మారుమూల గిరిజన గ్రామాలలో పేద పిల్లలకు సహాయం చేయడానికి ఇటువంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని సంస్థ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ కేర్ సెంటర్ ఇంఛార్జిలు పూజారి రాజేశ్వరి, లక్ష్మీ నారాయణ, సంస్థ ప్రతినిధులు మురళీ కృష్ణరెడ్డి , సతీష్ డే కేర్ సెంటర్ సిబ్బంది, సీనియర్ జర్నలిస్టు దొడ్డా ప్రభుదాస్, రిటైర్డ్ టీచర్ కొంగూరు. నర్సింహారావు గ్రామస్తులు పలువురు పాల్గున్నారు. ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన నీలి ప్రకాష్ ను సంస్థ ప్రతినిధులు శాలువా కప్పి సన్మానించారు.

# పాల్వంచలో ముగిసిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

**పాల్వంచ ఫిబ్రవరి 7 నవభూమి ప్రతినిధి:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ మహాసభలు స్థానిక పాల్వంచ పట్టణ కేంద్రంలో రెండు రోజుల పాటుకోన సాగాయి. ఈ సందర్బంగా శు క్రవారం జరిగిన ముగింపు కార్యక్రమం లో పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ఈ మహాసభలు విద్యార్థులలో చైతన్య వాతావరణాన్ని నింపాయని, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం పునాదులపై సైద్ధాంతికంగా సుధీర్ఘ చర్చలు జరిపి విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలకు నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అలాగే జిల్లాలు విడిపోయిన తరువాత కూడా ప్రభుత్వ విద్యారంగ, విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అనేక పోరాటాలను చేయడంలో ఎస్ఎఫ్ఐ ముందంజలో ఉందిని, ఈ మహాసభలో ప్రతినిధులు విద్యారంగ సమస్యల పై అనేక తీర్మానాలను రూపొందించారని, మహాసభల అనంతరం అధ్యక్ష , కార్యదర్శులుగా మందా. నాగకృష్ణ , భయ్య. అభిమన్యు ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఏడుగురు ఆఫీస్ బేరర్లతో మొత్తం 21 మంది జిల్లా కమిటీ ఎన్నిక అవ్వడం జరిగిందన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన మహాసభల సమావేశాలు వారిలో పోరాట పటిమను నింపాయని, స్వాతంత్రోద్యమ వీరుల స్ఫూర్తిని నింపుకొని రాబోయే పరిస్థితులను ఎలా



ఎదుర్కోవాలో వచ్చిన ప్రముఖుల ఆలోచనలను పంచుకున్నారన్నారు. జిల్లాలో ఉన్న మండలాలన్నింటి నుండి వచ్చిన ప్రతినిధులు నూతనోత్సాహంతో తిరుగు ప్రయాణ మ య్యారని అన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, ఖమ్మం జిల్లా కార్యదర్శి ప్రవీణ్, మాజీ జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రం, రాష్ట్ర కమిటీ సభ్యురాలు భవ్య, భద్రాచలం మాజీ డివిజన్ కార్యదర్శి సంద్ర భూపేందర్, జిల్లా ఉపాధ్యక్షులు రాంచరణ్, పాల్వంచ మండలం నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు

# ఫిబ్రవరి నెలలో మామిడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

■ **జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి యం.వి. మధుసూదన్**

**ఖమ్మంనగరం, నవభూమి, ఫిబ్రవరి 7:** ఖమ్మం జిల్లాలో మామిడి సాగును 32,105 ఎకరాలలో సాగుచేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో సత్తుపల్లి, వేంసూర్, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం తదితర మండలాల నందు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ముఖ్యంగా సాగులో ఉన్న రకాలు బంగినపల్లి , దశేరి, హిమాయత్, తోతపూరి, రసాలు తదితర రకాలను సాగు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులు మరియు క్రితం పరిస్థితులు దృష్ట్యా రైతులలో మరియు వినియోగదారులలో ఈ మామిడి పండ్ల వినియోగం బాగా పెరిగింది. ఎందుకనగా ఈ మామిడి పండ్లలో విలువైన పోషకాలతో పాటు ఖనిజ లవణాలు, విటమిన్లు, పీచు పదార్థం కలదు. తద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి కరోనా తో పాటు ఇతర వ్యాధులను వినియోగదారుల శరీరం తట్టుకుంటాయి. ప్రస్తుతం మామిడి పూత నుండి పిందె దశలో ఉన్నది. ఈ సమయములో ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాల్సినదిగా జిల్లా ఉద్యాన  పట్టు పరిశ్రమ అధికారి యం.వి. మధుసూదన్ తెలిపారు.  1. పూత నుండి పిందె కట్టే దశలో ఉన్నటువంటి తోటలలో నీటి యాజమాన్యం చాలా కీలకం నీటిని తక్కువ మోతాదులో ఇవ్వాలి ఎక్కువ ఇచ్చినట్లయితే తామర పురుగు తేనెమంచు పురుగు బూడిద రోగం సమస్యలు పెరుగుతాయి. 2. కావున 8–15 రోజుల వ్యవధిలలో భూములను పట్టి ఇచ్చుకోవాలి. 3. భూమిలో తేమ ఎక్కువ ఉన్నప్పుడు మామిడి తోటలో గడ్డి దోమ ఎక్కువగా ఉంటుంది దీనివలన ఎలాంటి హాని లేదు. 4. ఈ సమయంలో ప్రధానంగా నాలుగు రకాల సమస్యలు ఉంటాయి ఎ) నిక్కుడు పురుగు ( సెమీ లూపర్). బి) తేనె మంచు పురుగు సి) తామర డి) బూడిద రోగం మరియు పక్షి కన్ను తెగులు. 5. వీటి నివారణకు 500 లీటర్ల నీటిలో ఇమిడక్లోప్రిడ్ మరియు ఫిప్రోనేల్ (పోలీసు తదితర )100 గ్రాములు మరియు ఏమమెక్టిన్ బెంజోయేట్ 250 గ్రాములు మరియు మారినో 1 లీటరు మరియు బొరన్20, 500 గ్రాములు మరియు హెక్సకోణాజోలు మరియు1 లీటరు కలిపి చెట్టు అంతా తడిచే విధంగా ఒక్క పిచికారి చేసుకున్నట్లయితే అన్ని రకాల తెగుళ్లు మరియు పురుగుల బెడద తగ్గుతుంది దీనితోపాటు మంచి పిందకట్టు కూడా ఉంటుంది.  పిందెలు రాలకుండా నీటి తడులు  మామిడిలో ఏర్పడిన పిందెలు రాలిపోవడం పెద్ద సమస్య. నీటి ఎద్దడి, హార్మోనులు మరియు పోషక లోపాలవల్ల ఇలా జరుగుతాయి. పిందెలు ఏర్పడే దశలో మరియు తిరిగి 15–20 రోజుల వ్యవధిలో నీటి అవకాశమున్న చోట్ల చెట్లకు 2–3 నీటి తడులివ్వడం మంచి ఫలితాలిస్తాయి. దీనివలన పిందెలు రాలడం తగ్గడమే కాకుండా కాయలు పెద్ద సైజులో నాణ్యంగా ఉంటాయి. కాయలకు మంచి ధర వస్తుంది. నీటి సౌకర్యం లేనిచోట చెట్లకు నీటిని ట్యాంకర్లతో తోలినా ఖర్చుకు మించి ఆదాయం వస్తుంది.  నాణ్యమైన కాయల కోసం ఎరువుల వాడకం  మామిడిలో పిందెలు ఏర్పడి పేరిగే దశలో చెట్ల సైజును బట్టి 500–100 గ్రా. యూరియా, 500%–%1000 గ్రా. పోటాష్ ఎరువులను 2 కిలోలవేపపిండితో కలిపి ప్రతి చెట్టుకూ వేసుకోవడం వలన కాయలు పెదసైజులో వచ్చి నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి.  ఒక సారి చల్లిన మందులను మరోసారి చల్లకండి  చీడలనివారణలో ఉత్తమ ఫలితాలకోసం వీలైనంత వరకు ఒకసారి చల్లిన మందులను మరోసారి చల్లకూడదు. దీనవలన పురుగులు మందులను తట్టుకొనే శక్తి సంపాదించుకునే అవకాశముంది. అందుకే పైన ఒక్కో సమస్యకు ఒకటి కంటే ఎక్కువ మందులు సిఫార్సు చేయడం జరిగింది. సిఫార్సు చేసిన మందులను సిఫార్సు చేసిన మోతాదులోనే వాడాలి  అధిక ఖర్చులు పెట్టి మందులను కొని పంటపై చల్లినప్పుడు అవి చల్లినప్పుడు అవి మంచి ఫలితాలు ఇవ్వాలంటే తప్పనసరిగా సిఫార్సు చేసిన మోతాదులోనే వాడాలి. ఉపయోగించే మందులను కూడా అధికారులు లేదా నిపుణులు సిఫార్సు మేరకు మందులను అడిగి తీసుకోవాలి. ఇందులో వ్యాపారులప్రమేయం లేకుంటే మంచిది. అధికారులు రైతులు సేవకోసమే పనిచేస్తున్నారనే విషయాన్ని రైతులు గుర్తెరిగి, అధికారులసలహాలు పొందుటకు సంకోచించకూడదు. అవసరమైతే సంబంధిత అధికారులను మరోసారి సంప్రదించి వారి సలహా మేరకు మందులను మార్చుకోవాలి.









# ఘనంగా మాతా రమాబాయి అంబేద్కర్ 127 వజయంతి వేడుకలు



**బూర్గంపాడు ఫిబ్రవరి 7 నవభూమి:** మండల కేంద్రమై కృష్ణ సాగర్ లో జాతీయ మాల మహానాడు బూర్గంపాడు యూత్ అధ్యక్షులు సల్వాది యశ్వంత్ ఆధ్వర్యంలో జాతీయ మాల మహానాడు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పుట్టి శ్రీనివాసరావు, పినపాక నియోజకవర్గ అధ్యక్షులు పిల్లి రవివర్మ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సతీమణి మాత రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ మాలమహానాడు పినపాక నియోజకవర్గం అధ్యక్షులు పిల్లి రవి వర్మ పుట్టి శ్రీనివాసరావు వారు మాట్లాడుతూ తాను కొవ్వొత్తుల కరిగిపోతూ మనందరి జీవితాల్లో వెలుగులు నింపిన మాతృమూర్తి రమాబాయి అంబేద్కర్ అని కొనియాడారు. ఈ స్వార్థపూరితమైన సమాజం కోసం తన పిల్లలను చంపుకొని మనమే తన పిల్లలను అనుకొని తన జీవితాన్ని ధారపోసిన మహనీయురాలని అన్నారు. మన అమ్మ కేవలం నవమాసాలు మోసి పురిటినొప్పులు పడి నీకు జన్మనిస్తే, ఆ దంపతులిద్దరూ మన జీవితాల్లో స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం పునర్జన్మ ను ప్రసాదించాలని తెలిపారు. ఈ భూమ్మీద నేను ఎవరికైనా రుణపడి ఉన్నాను అంటే అది కేవలం నా భార్య రమాబాయ్ అని అంబేద్కర్ కంటనీరు పెట్టుకున్నారు అని పేర్కొన్నారు. ఈ భారతదేశ తలరాతను మార్చిన ప్రపంచ మేధావి నవ బుద్ధుడు బోధి సత్వ బాబాసాహెబ్ అంబేద్కర్ అంత త్యాగమూర్తి మాత రమాబాయి అంబేద్కర్ అని, ఆ తల్లికి ఈ దేశమంతా రుణపడి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో, తాటి సుధాకర్, పొన్నాల నారాయణ, నిత్యశ్రీ, రామకృష్ణ, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



**గుండాల ఫిబ్రవరి 6 నవభూమి:** సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్, ప్రజాపంథా అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో దుయ్యబట్టారు. సంవత్సరానికి ఒక్క రైతుకు 12 వేల రూపాయలు ఇస్తామని ఇవ్వకపోగా రైతు భరోసా రైతులందరికీ ఇవ్వాలని ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి హామీ పనులు మండలంలో ప్రారంభమవుతున్నాయి. అయితే ఉపాధి హామీ కూలీలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు ఉపాధి పనులకు వచ్చేవారు ఎక్కువగా వ్యవసాయ కార్మికులే ఎండాకాలంలో వ్యవసాయ పనులు లేనందున పనులు దొరకనందున పేద ప్రజలు ఉపాధి హామీని నమ్ముకుని జీవిస్తున్నారు. అయితే పని ప్రదేశాలలో మంచినీరు నీడ మెడికల్ కిట్లు తదితర కనీస సౌకర్యాలు లేనందున తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా పార గడ్డపార తట్టలు తదితర పనిముట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు మరి కొంతమంది రోజులు పూర్తి చేసుకొని మిగతా రోజులు ఏ పనులకు వెళ్లాలో అర్థం కాక ఆందోళనకు గురవుతున్నారు కనుక ప్రభుత్వం సంవత్సరానికి 200 రోజులు పనులు కల్పించి రోజుకు కొలతలతో సంబంధం లేకుండా 600 రూపాయలు కూలి చెల్లించాలని ఉపాధి పనులకు కేటాయించిన నిధులను ఉపాధి పనులకే ఖర్చు చేయాలని తమరిని కోరుతున్నాము అలాగే పాత బకాయిలను వెంటనే చెల్లించాలని జిల్లా కలెక్టర్ కి మెమోరండం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకే ఏఐపీకే ఏంఎస్ జిల్లా నాయకులు, అమలపురి రాము, బొర్రా వెంకన్న, తెల్లం రాజు, పి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ గుడిలో మహా కుంభాభిషేక మహెూత్సవాలు

**పాల్వంచ టౌన్ ఫిబ్రవరి7 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశ్వాపురం – జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి) లో శుక్రవారం ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ శివాలయంలో శ్రీ స్వామివారి పరివార దేవత సహిత జీవధ్వజ పంచాహ్నిక దీక్ష ప్రతిష్టాపన అమ్మవారి పంచమ పుష్కర పూర్వక మహా కుంభాభిషేక మహెూత్సవ ములు ప్రారంభించామని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి తెలిపారు. రెండవ రోజు ప్రతిష్ట మహెూత్సవము లో గణపతి పూజ,అగ్ని మదనము అగ్ని ప్రతిష్ట, మూలమంత్ర హెూమము 11 గంటల 30 నిమిషాలకు భక్తులు పసుపు బట్టలతో నీళ్ల బిందెలతో ఊరేగింపుగా దేవాలయమునకు చేరుకొని ప్రదక్షణ లు అనంతరం ప్రతిష్టామూర్తులకు జలాధివానము నిర్వహించనున్నారు. మహిళా భక్తులచే సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారికి పంచామృత అభిషేకం, పంచ హారతులు, నివేదన, నీరాజనం మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. చండీ హెూమం చతుర్ధిక్ష సహిత సర్వతో భద్ర మంటప మహెూత్సవములు, నీరాజన మంత్రపుష్పం, శనివారం 8 రోజున ఉదయం 8 గంటలకు గణపతి పూజ కర్మణ, పం చా అమృత పంచగవ్య, మూలమంత్ర మహెూత్సవములు 10:30కు ప్రతిష్టామూర్తులకు క్షీరాభిషేకం నిర్వహించనున్నారు. భక్తులు స్వహస్తములతో చేసుకోవచ్చని, మధ్యాహ్నం ప్రభూత బలిహరణ ప్రతిష్టామూతుల చే నిర్వహిస్తున్నామని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి తెలిపారు.









# న్యాయవాది ఉకే రవిపై దౌర్జన్యాన్ని ఖండించండి



**బూర్గంపాడు ఫిబ్రవరి 7 నవభూమి:** గిరిజనేతరులపై వెంటనే ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆదివాసి సేన మండల కన్వీనర్ కుర్సం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇక్కడ జరిగిన సంఘటనపై అక్కడ సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినందున పోలీసు వారు జాప్యం చేయకుండా వెంటనే స్పందించి ఎలాంటి పక్షపాతం లేకుండా ఎలాంటి ఒత్తిడిలకు గురి కాకుండా కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనేతరులు ఏజెన్సీ ప్రాంతాల్లోకి అక్రమంగా చొరబడి ఆదివాసుల భూములను అన్యాయంగా తీసుకోడమే కాకుండా తిరిగి ఆదివాసులపై తిరగబడడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఆదివాసులపై జరుగుతున్న అన్యాయాలు అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి న్యాయబద్ధంగా చట్టబద్ధంగా పోరాడుతున్న న్యాయవాది ఊకె రవిపై కొందరు గిరిజనేతరులు నీవల్లనే మా భూములు పోతున్నాయి, మా ఇల్లు కూడా ఖాళీ చేయాలని చెబుతున్నారు అంటూ గిరిజనేత్రుడు న్యాయవాది రవి నీ దగ్గరికి వెళ్లి పురుగుల మందు తాగి చస్తామని బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరిస్తున్నారని దుర్భసలాడుతుంది పొద్దుపరిగా గ్రామంలో ఉన్నటువంటి నీళ్ల ట్యాంకు ఎక్కి ఊకే రవి లాయర్ వలన మేము చనిపోతున్నాం. మా చావు కారణం లాయర్ ఊకే రవి అని ఫోన్ చేసి బ్లాక్మెయిల్ చేస్తూ వేధిస్తున్నారని గతంలో పాల్గొని మండలంకు సంబంధించిన ఒ కేసు విషయంలో కూడా గిరిజనులకు గిరిజన ఇతరులు దగ్గర ఉన్నటువంటి భూమిని పంచనామా చేసి స్వాధీనం చేయాలని సంబంధిత అధికారులకు కలవగా ప్రతి విషయం మీద కూడా అడ్వకేట్లు పేర్లు రాసి మేము చనిపోతామని బెదిరించినా సంఘటన ఉన్నాయని అన్నారు. ఈరోజు నేరుగా రవి ఇంటికి వచ్చి చచ్చిపోతున్నామని బెదిరిస్తూ ఉండడంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడం జరిగింది. ఆదివాసీ ప్రాంతంలో గిరిజన ఇతరులు వలసల ప్రభావంతో ఆదివాసులపై వివిధ రూపాల్లో జరుగుతున్న దాడుల నుండి తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసి సేన మండల కన్వీనర్ కుర్సం నాగేశ్వరరావు అన్నారు. కనుక అడ్వకేట్ రవికి ప్రాణహాని ఉన్నందున ప్రభుత్వం వెంటనే తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నామని అంతేకాకుండా రవిపై బెదిరింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి అని కురుసం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమంగా చొరబడి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న గిరిజనేతరులను వెంటనే మైదాన ప్రాంతాలకు పంపించే ప్రక్రియను ప్రారంభించాలని ఆదివాసి సేన మండల కన్వీనర్ కర్సం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు

# మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు రావాల్సిందే

**చేవెళ్ల జనవరి 07 నవభూమి :**–30 యేళ్ల వర్గీకరణ పోరాటంలో ఎమార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఎన్నో ఆటుపోట్లకు ఎదురొడ్డి ముక్తకంఠంతో వర్గీకరణ సుసాధ్యం చేశారని, మందకృష్ణ మాదిగ పోరాటంతోనే మాదిగలకు, మాదిగ ఉప కులాలకు, మాల ఉపకులాలకు రిజర్వేషన్లు వచ్చాయని.. సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు రాష్ట్రాలు అమలు చేసుకోవాలని తెలిపిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి 30 యేళ్ల వర్గీకరణ పోరాటం గుర్తుంది కాని మాదిగల చిరకాల ఆంకాంక్షను నేరవేర్చిన మంద కృష్ణ పేరును కూడ అసెంబ్లీలో ముఖ్యమంత్రి పలకపోవడం పట్ల మాదిగలు, మాదిగ ఉపకులాలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నామని, శంకర్ పల్లి మండల అధ్యక్షులు బండ్లగూడెం శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేల గొంతులు, లక్ష డప్పుల కార్యాక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగలకు జనాభా ప్రాతిపదిక వాటా పంచినా, వెనక బడిన జాతుల ప్రకారమైనా మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ రావాలన్నారు. పంపకాలలో మాదిగలకు అన్యాయం జరిగితే ఇంతకన్నా పెద్ద ఎత్తున ప్రభుత్వంపై యుద్ధం చేయడానికి మాదిగలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎవరివాటా వారికి పంపకం చాతకాలేదా ఈ ముఖ్యమంత్రికి లేదా మాలల వత్తిడికి తలొగ్గి మాదిగలకు కేవలం 9 శాతం రిజర్వేషన్ ఇచ్చారా అంటు ప్రశ్నించారు. దాదాపు 300 వందల డప్పులతో వందల సంఖ్యలో మాదిగలు చౌరస్తాపైకి వచ్చి డప్పులను కొడుతుంటే చౌరస్తా మారుమోగింది, మాదిగల డప్పుల విన్యాసాలు, ఆట పాటలు అందరిని ఆకట్టుకున్నాయి.

# కిన్నెరసాని కాలువలో కలకలం రేపిన మొసలి

■ భయం గుప్పిట్లో ఆ ప్రాంత ప్రజలు







**పాల్వంచ ఫిబ్రవరి 7 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ లోని కెటిపిఎస్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి, మండలం లోని కిన్నెరసాని రిజర్వాయర్ నుండి నీటిని తరలించే కాలువలోఓ మొసలి శుక్రవారం కల కలం రేపింది. స్థానికుల, ప్రత్యేక్ష సాక్షుల కధనం మేరకు వివరాలు ఈ విదంగా ఉన్నాయి. మండల పరిధి లోని కిన్నెరసాని లో గల రిజర్వాయర్ నుండి, పాల్వంచ లో ఉన్న కెటిపిఎస్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి అవసరమయ్యే నీటిని ప్రత్యేకంగా దీని కోసమే తయారు చేసిన కాలువల ద్వారా తరలిస్తుంటూరు. అయితే శుక్రవారం కొంతమంది కాలువ వద్దకు తమ అవసరాలు తీర్చు కునేందుకు వెళ్లిన కిన్నెరసాని ప్రాంత ప్రజలకు కాలువలో మొసలి కనిపించడం తో ఒక్కసారి గా భయాందోళనకు గురైయ్యారు. విషయాన్నీ పక్కనే ఉన్న అటవీశాఖాది కారుల దృష్టికి తీసుకొని వెళ్లారు. పై అధికారుల సూచనల మేరకు కాలువలో ఉన్న మొసలిని కొంత మంది జాలరులు వల వేసి పట్టుకున్నారు. పట్టుకున్న మొసలిని అటవీ శాఖాది కారులు తిరిగి కిన్నెరసాని రిజర్వాయర్ లో వదిలి వేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సహజంగా అయితే కిన్నెరసాని ప్రాంతానికి చెందిన కొంతమంది తమ అవసరాల కోసం కాలువ వద్దుకు వచ్చి, స్నానాలు చేసి, బట్టలు ఉతుక్కొని వెళుతుంటారు. అంతే కాకుండా పర్యాటకులు, పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు కూడ కాలువ వద్దకు చేరుకొని స్నానాలు చేస్తుంటారు. మొసలి ముందుగానే కనిపించటం తో సరిపోయింది, లేకపోతే ఎంత పెద్ద ప్రమాదం జరిగేదొనని ప్రజలు అనుకుంటున్నారు. అసలు కాలువలోకి మొసలి ఎలా వచ్చిందో నన్న అనుమానలు తలెత్తు తున్నాయి. రిజర్వాయర్ నుండి కేటీపిఎస్ కు నీటిని వదిలే దగ్గర వాల్స్ ఉంటాయి. మరి మొసలి ఎలా నీటిలోకి వచ్చి ఉంటుందో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం కిన్నెరసాని వద్దనే మొసలి కాలువలో కనిపించగా, గతంలో కరక వాగు గ్రామం వద్ద ఉన్న ఇదే కాలువలో కనిపించింది. మొసళ్ల ద్వారా పెను ప్రమాదం జరుగక ముందే అసలు ఈ మొసళ్ళు కాలువల్లోకి ఎలా వస్తున్నాయో.. అన్నా విషయాన్ని తెలుసుకొని ఆ దిశ గా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, పర్యటకులు సంబంధిత అధికారులను

## ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



**ములకలపల్లి ఫిబ్రవరి 7 నవభూమి:** ములకలపల్లి మండలంలో ముకమామిడి పంచాయతీలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న గడ్డం నాగరాజు(33) అనారోగ్యంతో మృతి చెందాడు. గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కొత్తగూడెం లో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందడం జరిగింది అని కుటుంబ సభ్యులు తెలియపరచడం జరిగింది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. నాగరాజు మృతితో ఆ కుటుంబం మరియు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి



**కారేపల్లి,నవభూమి, ఫిబ్రవరి 07**:కారేపల్లి మండల కేంద్రంలో లంబాడీల ఐక్యవేదిక (లైవ్) ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి ఏర్పాట్లపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బంజారాల ఆరాధ్యదైవం సద్గురు సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవు దినంగా ప్రకటించాలని తహసిల్దార్ సంపత్ కుమార్, ఎంపీడీవో సురేందర్ కు శుక్రవారం లంబాడి ఐక్యవేదిక (లైవ్) భద్రాద్రి జోనల్ (భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం) జిల్లాల ఇన్చార్జి బాలునాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలు నాయక్ మాట్లాడుతూ దేశ జనాభాలో 14 కోట్ల మంది ఉన్న బంజారాలు తెలంగాణలో కన్నుల పండుగగా ఈ వేడుక నిర్వహిస్తామన్నారు. బంజారాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సెలవును అధికారికంగా ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సిక్కుల ఆరాధ్యదైవమైన గురునానక్ జయంతి, మహమ్మద్ ప్రవక్త జయంతి ని ఇచ్చే సెలవుల్లో దీనికి సైతం చేర్చాలన్నారు. రాష్ట్రంలో 12 శాతం (40 లక్షల) జనాభా ఉండటంతో ప్రతి గ్రామంలో భోగ్ బండారో వేడుకను ఐక్యంగా కలిసి అంగరంగ వైభవంగా నిర్వహించాలని కోరారు. విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తానని తాహసిల్దార్, ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు బానోతు రాములు నాయక్, భూక్య సక్రియ నాయక్, ఆంగోత్ రవి (ఠాగుర్), భూక్య రంజిత్ నాయక్, వాంకుడోత్ రమేష్ నాయక్, బానోత్ శంకర్ నాయక్, భూక్య మోతిలాల్ నాయక్, లంబాడీల ఐక్యవేదిక (లైవ్) నాయకులు భుక్య రమేష్, హాట్కర్ రాంబాబు, బానోత్ ప్రేమ్ నాయక్, అంగోత్ కుమార్, జగన్, చంటి, మోహన్, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

**ములకలపల్లి ఫిబ్రవరి 7 నవభూమి:** ములకలపల్లి మండలం పాతగంగారం గ్రామంలో జరుగుతున్న తాటి వీరభద్రం కుమారుడు నవీన్ వివాహ వేడుకలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు దారా యుగంధర్, నందమూరి సురేష్, సోడెం గంగరాజు, తాటి పోతురాజు, తాటి రవి, మండల యువజన విభాగం అధ్యక్షుడు తాటి ప్రవీణ్, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.



# వడ్డెర కులస్తులను ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో దామాషా ప్రకారం సీట్లను కేటాయించాలి
- గ్రామ స్థాయి నుంచి సంఘం బలోపేతానికి చర్యలు
- ఏకగ్రీవంగా గ్రామ కమిటీలు ఎన్నిక
- తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రాయల రమణయ్య, మండల అధ్యక్షులు రాయల వీరన్న



**కామేపల్లి, నవభూమి,ఫిబ్రవరి 7** : కామేపల్లి మండల పరిధిలోని తాళ్లగూడెం పింజమడుగు, పొన్నెకల్లు, బండిపాడు, మద్రిగూడెం గ్రామాలలో అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సారధ్యంలో అధ్యక్ష,ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యులను గురువారం ఎన్నిక చేయటం జరిగింది. ప్రత్యేక సమావేశం నిర్వహించి అందరి సమక్షంలో ఏకగ్రీవంగా వారిని ఎన్నుకోవడం జరిగింది. మద్రిగూడెం గ్రామంలో అధ్యక్షులుగా రాయల జగన్నాథం,ఉపాధ్యక్షులుగా చల్ల వీరన్న,తాళ్లగూడెం బాధ్యులుగా రాజేంద్ర, పింజరమడుగు లో ఎస్. వెంకన్న,ఎస్.అంజయ్య, రాయల కోటయ్య బండిపాడు గ్రామం లో చల్లా రవిని బాధ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.అదే విధంగా పొన్నెకల్లు గ్రామం లో అధ్యక్షులుగా దండుగుల నాగయ్య, ఉపాధ్యక్షులుగా సిహెచ్ నాగేశ్వరరావును ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాయల రమణయ్య,మండల అధ్యక్షులు రాయల వీరన్న, ఉపాధ్యక్షులు చల్లా వీరన్న, సహాయ కార్యదర్శులు బి. ఎల్లయ్య,డి.నాగేశ్వరరావు,సిహెచ్ రమేష్,వి. సూర్యనారాయణ,ఎస్ మల్లయ్య, కోశాధికారి బి. శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షులు బి.ఎల్లయ్య, రాజు, ప్రచార కార్యదర్శి సిహెచ్ రవి, పాల్గొన్నారు. వడ్డెర కులాన్ని ఎస్టిలో చేర్చాలని,రాబోవు ఎన్నికలలో దామాషా ప్రకారం స్థానిక సంస్థలలో సీట్ల ను కేటాయించాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించారు. హైదరాబాద్ లో త్వరలో జరుగు భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఉద్యోగుల సమస్యలపై గొంతుకనైతా

■ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య

**మెదక్ నవభూమిప్రతినిధి:** గత ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని కానీ నేటి బీజేపీ ప్రభుత్వం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నూతన ఒరవడిలో ప్రత్యేక ప్రణాళిక తో ముందుకెళ్తుందని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ లో నామినేషన్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుండి తీసి చార్మినార్ జోన్ లో కలిపే ప్రయత్నం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం 317 జి. ఓ రద్దు చేయాలి దానికి ఒక కమిటీ వేయాలన్నారు.గత ప్రభుత్వం సమస్యలు



తెలుసుకోకుండా జివో తేవడం హేయమైన చర్య అని ఎద్దేవాచేశారు.బిజెపి ప్రభుత్వం విద్యకు చాలా ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తెలంగాణ లోకాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి సంవత్సరం అవుతున్న ఉపాధ్యాయుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు.

# నిరుపేదల గుండెల్లో అమర జీవి కాసాని ఐలయ్య



**జూలూరుపాడు,ఫిబ్రవరి 07(నవభూమి ప్రతినిధి)** నివసించటానికి గూడు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కోసం అనేక మార్లు జైలు జీవితం గడుపి ఎట్టకేలకు వేలాది మంది పేదలకు నివాస స్థలాలు పంచిన ఘనత సి పి ఎం పార్టీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ కాసాని ఐలయ్య కే దక్కిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యాసా నరేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయం లో ఇటీవల మరణించిన సి పి ఎం పార్టీ నాయకులు కామ్రేడ్ కాసాని అయిలయ్య సంస్మరణ సభను నిర్వహించారు.కాసాని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలం లో సిపిఎం పార్టీ నిర్మాత కాసాని అని అన్నారు.మండలం లో కూలి రేట్లు పోడు భూములు, దళిత గిరిజనల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలలో నిర్వహించి ప్రజలకు అండదండ గా నిలిచారని అన్నారు.ఆయన పోరాట స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్వహించడమే కామ్రేడ్ ఐలయ్య కు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి,గడిదేసి కనకరత్నం,తాటి పద్మ,పద్దం సుగుణ,భానోత్ ఈశ్వర్ శాఖా కార్యదర్శులు బోడ అభిమిత్ర,బొల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు





**చర్ల ఫిబ్రవరి 7 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పిహెచ్సి ఆధ్వర్యంలో భారతదేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల ముమ్మర కృషి కార్యక్రమం నిక్షయ్ షివిర్ లో భాగంగా చర్ల మండలం లక్మి కాలనీ లో ప్రజల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరిగినది. డాక్టర్ శ్రీధర్ మెడికల్ ఆఫీసర్ చర్లమాట్లాడుతూ టీవీ అత్యంత సామాన్యమైన వ్యాధి ఇది ఎవరికైనా రావచ్చు. వారానికి మించి దగ్గు జ్వరము ఆయాసం వంటి లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. క్షయ శరీరంలో ఏ భాగానికి అయినా రావచ్చు అని అందరికీ క్షయ మీద అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. క్షయ వ్యాధి వచ్చినట్లయితే ఎవరు కంగారు పడాల్సిన అవసరం లేదని మందులు ఉచితంగా గవర్నమెంట్ హాస్పిటల్లో లభిస్తాయి మందులు వాడినట్లయితే క్షయ సంపూర్ణంగా వెళ్ళిపోతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్ (ఎస్ కే డాక్టర్,) డాక్టర్ లీలా కృష్ణ (మొబైల్ మెడికల్ యూనిట్) హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, స్వరూప రాణి, భార్గవి ఫార్మసిస్ట్ దుర్గ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంటలను పరిశీలించిన ఉద్యాన అధికారులు

## ■ మామిడి తోటలలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

**ఖమ్మం రూరల్, నవభూమి, ఫిబ్రవరి 7:** స్థానిక కూసుమంచి డివిజన్ పరిధిలోని తల్లంపాడు, పొన్నెకల్, మద్దులపల్లి గ్రామాలలో సాగులో ఉన్న ఆయిల్ ఫామ్, పందిరి కూరగాయలు, మామిడి తోటలను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం వి మధుసూదన్, పాలేరు ఉద్యాన అధికారి పి అపర్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక దిగుబడి, చీడపీడల నివారణ కోసం రైతులు తీసుకోవలసిన మెలకువల గురించి అవగాహన కల్పించారు. కూసుమంచి డివిజన్ పరిధిలో 2,448 ఎకరాలలో మామిడి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మామిడి పూత నుండి పిందె దశలో ఉంది. ఈ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. పూత నుండి పిందె దశలో ఉన్నటువంటి తోటలలో నీటి యాజమాన్యం చాలా కీలకం. నీటిని తక్కువ మోతాదులో ఇవ్వాలి. ఎక్కువ ఇచ్చినట్లయితే తామర పురుగులు, తేనె మంచు పురుగులు, బూడిద తెగులు సమస్యలు పెరుగుతాయి. అందువల్ల 8-15 రోజుల వ్యవదిలలో భూములను పట్టి నీటి తడులు ఇచ్చుకోవాలి. ఈ సమయంలో వచ్చే ప్రధాన చీఢ, తెగుళ్ల నివారణకు 500 లీటర్ నీటిలో ఇమిడాక్లోప్రిడ్, ఫిప్రోనెల్ (పోలీసు ఈ టి సి) 100 గ్రాములు ం ఏమమేక్టిన్, బెంజోయేట్ 250 గ్రాములు ంమరినో 1లీటర్ ం 500 గ్రాముల బోరాన్ 20బోరాన్ ంహేక్సాకోనాజోలు 1లీటర్ కలిపి చెట్టు అంతా తడిచే విధంగా ఒక్కసారి పిచికారీ చేసుకున్నట్లయితే అన్ని రకాల తెగుళ్ళు, పురుగుల బెడద తగ్గుతుందని వివరించారు. పిందెలు రాలకుండా నీటి తడులు : మామిడిలో ఏర్పడిన పిందెలు రాలిపోవడం పెద్ద సమస్య. నీటి ఎద్దడి, హార్మోనులు, పోషక లోపాల వల్ల జరుగుతాయి. పిందెలు ఏర్పడే దశలో, తిరిగి 15-20రోజుల వ్యవదిలో నీటి అవకాశమున్న చోట 2-3 నీటి తడులు ఇవ్వడం మంచి ఫలితాలిస్తాయి. దీని వల్ల పిందెలు రాలడం తగ్గడమే కాకుండా కాయ నాణ్యత కూడా పెరుగుతుంది. నాణ్యమైన కాయల కోసం ఎరువుల వాడకం పిందెలు ఏర్పడి పెరిగే దశలో చెట్ల సైజును బట్టి 50-100 గ్రాముల యూరియా, 500-1000 గ్రాముల పోటాష్ ఎరువులను 2 కిలోల వేపపిండితో కలిపి ప్రతి చెట్టుకు వేసుకోవడం వల్ల కాయలు మంచి సైజులో వచ్చి నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి. మామిడి రైతులు సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు ఆకాంక్షించారు.









# రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాజీ జెడ్పీటీసీని పరామర్శించిన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్







**కారేపల్లి, నవభూమి, ఫిబ్రవరి 7:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న సింగరేణి మండలం మాజీ జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్ ను శుక్రవారం ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ పరామర్శించారు. సింగరేణి మండలం భాగ్యనగర్ తండాలో గల జగన్ ఇంటికి వెళ్లి, ప్రమాదానికి గల కారణాలు, వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అదే గ్రామంలోని రైతులతో ఆయన ముచ్చటించారు. కాంగ్రెస్ పాలనలో రైతులతో పాటు తెలంగాణలోని అన్ని వర్గాలకు దరిద్రం పట్టుకుందంటూ రైతులు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఎదుట వాపోయారు. అధైర్యం చెందొద్దని, మళ్లీ కేసీఆర్ వస్తారంటూ రైతుకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మకమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ ఉన్నం వీరేందర్, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ వైస్ చైర్మన్ ధారావత్ మంగీలాల్, నాయకులు ముత్యాల వెంకటప్పారావు, అడపా పుల్లారావు, మాజీ సర్పంచ్ బానోత్ కుమార్, శివరాత్రి అచ్చయ్య, బత్తుల శ్రీనివాసరావు, బాణోత రాందాస్, ఇస్లావత్ బన్సీలాల్, సిద్ధంశెట్టి నాగయ్య, జాలా సాంబ, షేక్ ఖాజావలి, యాకూబ్ పాషా, షేక్ సలీం, గుగులోత్ భాస్కర్, బాబూలాల్, సూక్య, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుక

## ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



**కామేపల్లి,నవభూమి ,ఫిబ్రవరి 7 :** కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024- 2025 విద్యా సంవత్సర కళాశాల వార్షికోత్సవ వేడుక ను శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ జి. నరేష్ కుమార్ అధ్యక్షతన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలోని సెకండ్ ఇయర్ విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు చెప్పటంతో పాటు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన తమ అనుభవాలను పంచుకోవడం జరిగింది. మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షల్లో మొదటి,రెండవ సంవత్సర విద్యార్థులు అందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులందరికీ వీడ్కోలు సమావేశం శుభాకాంక్షలు తెలియజేసి మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణుల వ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.వినోద్ బాబు, కె.రేవతి లక్ష్మి, ఎం శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.కె అక్బర్ పాషా, ఎండి రషీద్,డి. భాస్కర్, ఎస్.కె గౌస్య బేగం, ఆఫీస్ సిబ్బంది ఎం ఫాషా,పి వెంకటరత్నం, వై.శివ తదితరులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థలు, పంచాయతీల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలి

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, క్రైం, నవభూమి, ఫిబ్రవరి 7:** స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. శుక్రవారం పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అయన మాట్లడారు. పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చిన స్థానిక పోలీస్ అధికారులు అప్రమత్తంగా వుంటూ.శాంతి భద్రతల పరిరక్షణ, ఎన్నికల బందోబస్తు పోలీసులకు సవాల్‌గా మారకుండా ముందస్తుగా బందోబస్తుకు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ స్టేషన్లు, బూత్‌ల వద్ద పరిస్థితులు, వనరులపై వివరాలు సేకరించాలని సూచించారు. సాధారణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేటగిరీల్లో పోలింగ్ బూత్‌లను విభజించే మేరకు బందోబస్తుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ఎన్నికల సంబంధిత నేరాల చరిత్ర ఉన్న వారు, రౌడీ షీటర్లు, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితాను సిద్ధం చేయాలని అన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఎవరెవరిపై కేసులు ఉన్నాయనే వివరాలను పోలీస్ స్టేషన్ల వారీగా సేకరించి, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ అధికారులు ప్రణాళికలు రూపొందించాని సూచించారు. అదేవిధంగా ప్రతి కేసు విచారణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తద్వారా నిందుతులకు శిక్ష పడి నిజమైన బాధితులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో అడిషనల్ డీసీపీ ఆడ్మీన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు , ఏసీపీ వేంకటేశ్, సాంబారాజు, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన అగ్రిషోలో పాల్గొన్న మంత్రి తుమ్మల

■ **అన్ని జిల్లా కేంద్రాలలో సీజన్ ఆరంభలో అగ్రి షోల నిర్వహణకు మంత్రి ఆదేశాలు**

**ఖమ్మం నవభూమి బ్యూరో, ఫిబ్రవరి 7:** హైటెక్స్ లో ఏర్పాటు చేసిన అగ్రి షో లో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. అన్ని జిల్లా కేంద్రాలలో సీజన్ ఆరంభములో అగ్రి షోల నిర్వహణకు మంత్రి ఆదేశాలు జారీచేశారు. వ్యవసాయ, ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ విభాగాలను కలిపి రైతులకు సేవలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బేంబూ మిషన్ గిరిజన రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా పనిచేయాలని అధికారులకు ఆదేశాలు. రైతాంగాన్ని, వ్యవసాయ పరిశ్రమను, మరియు నూతన సాంకేతికతలను ఒకే వేదికపైకి తెచ్చేవిధంగా ఏర్పాటు చేసిన కిసాన్ అగ్రి షో కార్యక్రమ నిర్వహకులను మంత్రి తుమ్మల అభినందించారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రాష్ట్ర రైతుల అభివృద్ధి కోసం అనేక రకాల సబ్సిడీలను, అనేక విధానాలను, మరెన్నో అవకాశాలను అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల తెలియజేశారు. ముఖ్యంగా వ్యవసాయ యాంత్రీకరణ, సన్నధాన్యానికి బోనస్, రుణమాఫీ, రైతు భరోసా, నిరంతర శిక్షణ కార్యక్రమాలు వంటివి నిర్వహిస్తు, దాదాపు 40,000 కోట్ల నిధులను రైతులకు నేరుగా చెల్లించామని వెల్లడించారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు, ఆదాయాన్ని పెంపొందించేందుకు వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతలు మరియు వినూత్న ఆవిష్కరణలు ఎంతో అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. అదేవిధంగా తమ ప్రభుత్వం కూడా వ్యవసాయరంగంలో నూతన సాంకేతికతను పరిచయం చేయాలనే ఆలోచనతో పనిచేస్తుందని, దానికనుగుణంగానే సబ్సిడీలపై నూతన యంత్రాలను అందిస్తున్నామని తెలియజేశారు. అలాగే వ్యవసాయరంగంలో డ్రోన్ల, రోబోల ఉపయోగాలను పెంచడానికి కృషి చేస్తున్నామని, అందుకోసం ఇలాంటి కిసాన్ అగ్రి షో కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. రైతులందరూ ఈ కార్యక్రమం ద్వారా కొత్త విషయాలు తెలుసుకొని, వాటిని ఆచరించి అద్భుత ఫలితాలన్నారు. కిసాన్ అగ్రి షోలు కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా, ఉమ్మడి జిల్లా కేంద్రాలలో కూడా నిర్వహించే విధంగా చూడాలన్నారు. అలా చేయడం ద్వారా చాలా మంది రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని, అందుకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో 3 రోజుల పాటు నిర్వహించిన అగ్రి ఎగ్జిబిషన్ ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. జిల్లా కేంద్రాలలో నిర్వహించేవాటికి రాష్ట్ర ప్రభుత్వము తరపున సంపూర్ణ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రిగారు తెలియజేశారు. వ్యవసాయ, ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ విభాగాలను కలిపి రైతులకు సేవలు త్వరితగతిన అందేలా చర్యలను తీసుకోవాలని, బేంబూ మిషన్ లో గిరిజన రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా పనిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్ రావు, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి మరియు కిసాన్ అగ్రి షో నిర్వాహకులు, అధికారులు, వివిధ జిల్లాల నుండి వచ్చిన అధికారులు పాల్గొన్నారు.









# జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

# పాల్వంచ ఆశ్రమ గురుకుల వసతి గృహం తనిఖీ

**పాల్వంచ ఫిబ్రవరి 7 నవభూమి ప్రతినిధి:** స్థానికంగా ఉన్న ఆశ్రమ గురుకుల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డైనింగ్ హాల్, తరగతి గదులు, పరిసరాలు, మరుగుదొడ్లు, వంటగదిని పరిశీలించారు. పరిశీలనలో భాగంగా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారికి అందుతున్న ఆహారం మెనూ ప్రకారం అందిస్తున్నారా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డార్మెటరీ డోర్లు, కిటికీలు, త్రాగునీటి సమస్యలు, ఎలక్ట్రికల్ సమస్యలు పరిష్కరించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. డార్మెటరీ హాల్లో దోమలు రాకుండా జాలి ఏర్పాటు చేయాలని, ప్రహరీ గోడపై కంచ ఏర్పాటు చేయాలని, దానికి అవసరమైన నివేదికలు సమర్పించాలని సూచించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, నాణ్యత లేని పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మెనూను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం అందరి బాధ్యత అని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే వారు బాగా చదివి ఉన్నత శిఖరాలను చేరగలరని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డిడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, పాఠశాల హెడ్‌మాస్టర్ బద్రు, సిబ్బంది పాల్గొన్నారు.

